దశమి పూజలకు వేళాయే

దసరా సంబరం ప్రారంభమయింది. నియోజకవర్గంలోని పలు ఆలయాలు దుర్గాదేవి పూజలకు సిద్ధమయ్యాయి. 15 ఆదివారం నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దశమి వేడుకల నేపథ్యంలో వన్ టౌన్‌లోని ఆలయ ప్రాంగణాలన్నీ భక్తులు, నిర్వాహకులతో సందడి సంతరించుకున్నాయి.

- ఆలయాలకు ప్రత్యేక ముస్తాబు
- పలు రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవార్లు

దాబాగార్డెన్స్ : దసరా ఉత్సవాలు నియోజకవర్గం పరిధిలోని పలు ఆలయాల్లో ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. 15వ తేదీన ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు 23వ తేదీ వరకు కనుల పండవగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమయింది.

దుర్గాలమ్మ ఆలయంలో..



శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి దసరా నవరాత్రి మహోత్సవాలు జరపనున్నారు. ప్రతిరోజూ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 15న స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా, 16న బాలాత్రిపుర సుందరీదేవిగా, 17న గాయత్రీదేవిగా, 18న అన్నపూర్ణాదేవి (అన్నసమారాధన)గా, 19న లలితా త్రిపుర సుందరీదేవిగా, 20న మహా సరస్వతీదేవిగా (మూలా నక్షత్రం), 21న మహలక్ష్మీదేవిగా, 22న దుర్గాదేవి (దుర్గాష్టమి)గా, 23న మహిషాసుర మర్దినిగా, విజయదశమి రోజున రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. నవరాత్రులలో పూజ చేయించుకునే భక్తులు, వారి గోత్రనామాలు తెలిపి దేవస్థానంలో ముందుగా రూ.200 పూజా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 15న కన్యకా పరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా, 16న అన్నపూర్ణాదేవిగా, 17న గాయత్రీదేవిగా, 18న రాజరాజేశ్వరీదేవిగా, 19న ధనలక్ష్మిగా, 20న సరస్వతీదేవిగా, 21న శాకాంబరీదేవిగా, 22న మహాలక్ష్మిగా, 23న కాళీమాతగా, 24న దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు ప్రతిరోజూ తెల్లవారు జామున ప్రత్యేక పంచామృతాభిషేకాలు, సామూహిక పూజలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు.

సాగర గిరి కనక దుర్గమ్మ ఆలయంలో...

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాలకు యారాడ కొండ ముస్తాబయింది. ఈ మేరకు సాగర గిరి కనక దుర్గమ్మ గుడి కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలశ ప్రతిష్టతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అమ్మవారు 15న బాల త్రిపుర సుందరిగా, 16న గాయత్రి దేవిగా, 17న అన్నపూర్ణాదేవిగా, 18న భువనేశ్వరి దేవిగా, 19న లలితాదేవిగా, 20న సరస్వతి దేవిగా, 21న మహాకాళిదేవిగా, 22న శాకంబరి దేవిగా, 23న సాగరి గిరి కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. 24న సాయంత్రం అమ్మవారు సాగర జలాల్లో తెప్పోత్సవంలో విహరిస్తారని తెలిపారు.

భక్తుల దర్శనార్థం బోటు సౌకర్యం...

సాగర గిరి కనకదుర్గ దేవాలయానికి వెళ్లాలంటే సాగరాన్ని దాటాల్సి వుంటుంది. దీంతో అక్కడికి చేరుకోవడానికి నగరం నుంచి రోడ్డు మార్గం లేదు. పోర్టు అథారిటీ అనుమతితో బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు బోటు యజమాని గుప్త తెలిపారు. రోజూ పాత పోస్టాఫీసు దరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గల ఫెర్రీ నుంచి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బోటు సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫెర్రీ నుంచి దేవాలయం వరకు ఉచితంగా ఆటోలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



విశేష అలంకరణలో సాగర గిరి దుర్గమ్మ



సాగరి గిరి దుర్గమ్మ కొలువైన యారాడ కొండ

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

- ఆర్‌జేడీ జ్యోతికుమారి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 120 రోజుల పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడం తదితర చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కోరారు.

బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై, విద్యపై పూర్వ ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ రాష్ట్ర పరిశీలకుడు పైడి వెంకటరావు, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అకాడమీ మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.లక్ష్మి, కోనసీమ ఏఎంవో పి.రాంబాబు, కీ రిసోర్స్ పర్సన్లు ఆర్.ఎన్.ప్రసాద్, నిర్మలా కుమారి, హరిణి, తాతాజీ, రమాదేవి, సుచరిత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

దాబాగార్డెన్స్ : మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, నేటి తరం పాలకులు తమ మనుగడ, అధికారం కోసం మాత్రమే పని చేస్తున్నారని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం మానవ హక్కుల అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన, రాజకీయ బలం ఉన్న వారే మానవహక్కులు ఉల్లంఘిస్తున్నారని, మానవ హక్కులపై గ్రామ స్థాయి నుంచి విస్తృత ప్రచారం కల్పించేందుకు తమ వంతు బాధ్యతగా ఈ తరహా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాధవి, గుండు అప్పలరాజు, వీఎస్ఎస్ మూర్తి, సత్యనారాయణ, పైడిరాజురెడ్డి, ప్రసాదరావు, నక్కాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన శిక్షణ తరగతులు



పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు తదితరులు

గోపాలపట్నం: పరిశ్రమ 4.0 కాన్సెప్ట్‌ను అనుసరించి ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలని విశిష్ట శాస్త్రవేత్త డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, దేశాభివృద్ధి కోసం ఉద్యోగులంతా ఆధునిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ క్రమ పద్ధతిలో ప్రాజెక్టు పూర్తికి పరిశ్రమ 4.0 దోహదపడుతుందన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ కోర్సులో స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఎఫ్ కోర్సు డైరెక్టర్ ఎస్.మధుకిరణ్, శాస్త్రవేత్త, జీ టెక్నాలజీ డైరెక్టర్ కేదార్‌నాథ్, ఐఐటీ, పలు వర్సిటీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం : చక్రధర్‌పూర్ డివిజన్, రూర్కెలా స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల నిమిత్తం సోమవారం (ఈ నెల 16వ తేదీ) జగదల్‌పూర్–రూర్కెలా (18108) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా (18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ప్రయోగాత్మక హాల్ట్

ప్రయాణికుల సౌకర్యార్థం రూర్కెలా–జగదల్‌పూర్–రూర్కెలా(18107/18108) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి బమ్రా స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేడు బెంగళూరు–హతియా వన్ వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–హతియా(06503) వన్ వే స్పెషల్‌ను నడుపుతున్నారు. ఈ రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరి అదే రోజు అర్ధ రాత్రి 2.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి సోమవారం సాయంత్రం 5.45 గంటలకు హతియా చేరుకుంటుంది.

కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తా

దాబాగార్డెన్స్ : కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సంతరించుకునేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ ఏపీ జనరల్ సెక్రటరీగా నియమితులైన గుత్తుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న తన సేవలను అధిష్టానం గుర్తించి ఈ పదవి ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ విజయానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

అధికారులు మారినా.. పేర్లు మారని వైనం



జోన్-5 కార్యాలయంలో పాత సమాచారంతో కూడిన బోర్డు

కంచరపాలెం : జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు మారి కొత్తవారు విధుల్లో చేరి నెలలు గడుస్తున్నా సమాచార హక్కు చట్టం–2005లో కొత్తవారి పేర్లు చేర్చకపోవడంతో అర్జీదారులు అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతున్నారు. గత ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, యూసీడీ, రెవెన్యూ అధికారుల పేరు, ఫోన్ నంబర్‌ను తొలగించకుండా అలానే వదిలేశారు. జోనల్ కార్యాలయంలో ప్రస్తుత అధికారుల ఫోన్ నంబర్లతో గల బోర్డు ఏర్పాటు చేయాలని స్పందనకు వచ్చే పలువురు అర్జీదారులు కోరుతున్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



ఫుట్‌బాల్ క్రీడాకారులతో కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమని 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ పేర్కొన్నారు. వార్డులో శనివారం వేదాంత జనరల్ కార్గో కంపెనీ ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలు పిల్లలకు క్రీడల్లో కూడా శిక్షణ ఇవ్వాలని సూచించారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. అనంతరం పలు జట్ల మధ్య ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వేదాంత జనరల్ కార్గో కంపెనీ ప్రతినిధులు, క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

డివైడర్ల తొలగింపుతో ఇక్కట్లు



పూర్ణామార్కెట్ జంక్షన్‌లో వృథాగా పడి ఉన్న డివైడరు

జగదాంబ : నిత్యం రద్దీగా ఉండే జంక్షన్లలో పూర్ణామార్కెట్ ఒకటి. దక్షిణ నియోజకవర్గం పరిధి 35వ వార్డులో ఆరు నెలల క్రితం రోడ్డు వేసేందుకు రోడ్డు మధ్యలో గల బస్‌బే డివైడర్లను జోన్–4 సిబ్బంది రోడ్డు చివరికి మార్చారు. రోడ్డు పూర్తయినా డివైడర్లను ఇంకా రోడ్డు చివర అలాగే వదిలేయడంతో పూర్ణామార్కెట్ బస్టాప్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ విషయం మరిచిపోయారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో మద్దిలపాలెం, వాల్తేరు, గాజువాక, సింహాచలం డిపోలకు చెందిన సిటీబస్సులు పాత పోస్టాఫీసు, టౌన్‌కొత్తరోడ్డు వైపు వెళతాయి. బస్టాప్ ప్రాంతంలో బస్‌బే కోసం డివైడర్లు ఉండేవి. రోడ్డు నిర్మాణం పూర్తయినా సరే డివైడర్లు మార్చకపోవడంతో ఫుట్‌పాత్‌ని ఆనుకుని వున్న దుకాణదాలు, వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డివైడర్లు లేకపోవడంతో బస్సులు ఆగే చోట నిత్యం ఆటోలు తిష్ట వేస్తున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు డివైడర్లు లేకపోవడం, ఆటోలు తిష్ట వేయడం వలన బస్ డ్రైవర్లు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్–4 అధికారులు, వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్‌బే స్థలంలో డివైడర్లు ఏర్పాటు చేయాని స్థానికులు కోరుతున్నారు.

కళింగ సామాజికవర్గం అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరిస్తున్న కళింగ సామాజిక వర్గం ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : కళింగ సామాజిక వర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో నివాసం ఉంటున్న పలు వార్డులకు చెందిన కళింగ సామాజికవర్గ ముఖ్య నాయకులు ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్ నేతృత్వంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ కళింగ సామాజికవర్గం పట్ల తనకు ఎంతో అభిమానం ఉందన్నారు. వారి కృషికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తానని, ఏ కష్టం వచ్చినా తన వద్దకు రావొచ్చని, కళింగ సామాజిక వర్గం అభివృద్ధికి, నియోజకవర్గంలో సామాజిక భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో రవీంద్రభరత్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆశీర్వాదంతో నియోజకవర్గంలో గల కళింగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి, దక్షిణ కళింగ సంఘం పేరిట అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తమ్మినేని శ్రీనివాసరావు, అమృత ఆస్పత్రి ఎండీ డాక్టర్ చలపతిరావు, కొప్పుల సాయి, పైడి గోపాలరావు, మెట్ట భాస్కర్, పేడాడ అప్పలనాయుడు, భాగాన తాతారావు, న్యాయవాది మూల ఉమామహేశ్వరరావు, బమ్మిడి భానుప్రకాష్, హరిప్రసాద్, మెట్ట పాపారావు, చింతాడ రాజేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్‌ను కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి, బొడ్డేటి



వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, బొడ్డేటి ప్రసాద్

అల్లిపురం : వేంకటేశ్వరమెట్ట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వేంకటేశ్వరమెట్ట వాసుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి పార్టీ జిల్లా కార్యదర్శి, వేంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన సుబ్బారెడ్డి దేవదాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నాయకులకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహణ



ఎమ్మెల్యే వాసుపల్లికి వినతిపత్రం అందజేస్తున్న ఎల్లమ్మతోట నివాసితులు

దాబాగార్డెన్స్ : నియోజకవర్గం పరిధిలో గల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం తన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. 27వ వార్డు దొండపర్తి రామాలయం, పరదేశమ్మ ఆలయ చైర్మన్, ధర్మకర్తల పాలకవర్గ సభ్యులు దేవీ నవరాత్రుల ఉత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. 31వ వార్డులో ఎల్లమ్మతల్లి ఎండోమెంట్ అంశం పరిష్కరించి, అక్కడ నివసించే ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.
కార్యకర్తలను ట్రస్టీలుగా నియమించాలని కోరారు. హుద్‌హుద్ ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని పలువురు కార్యకర్తలు కోరారు. 35వ వార్డు కర్రలదొడ్డి ప్రాంతంలో వ్యాపారం చేసుకోకుండా ట్రాఫిక్ పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని పలువురు చెప్పడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి పోలీస్ అధికారులతో మాట్లాడారు. వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత జగనన్నదే



జగనన్నకు జై అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జగదాంబ : సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జీవీఎంసీ 36, 38, 39 వార్డుల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం అన్నారు. శనివారం జీవీఎంసీ 35వ వార్డు సైలాడ పైడితల్లి కల్యాణ మంపంలో 36, 38, 39 వార్డుల్లో వైఎస్సార్ సీపీ మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనదే అన్నారు. 36, 38, 39 వార్డుల కమిటీ కన్వీనర్ మాసిపోగు రాజు మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే ఎందుకు కావాలి అనే అంశంపై వివరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సన్యాసిరావు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు



రాజభాషా పురస్కారం అందజేస్తున్న రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ

సింధియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్ క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్వివాణి మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం హిందీలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంలో విశేష కృషి చేసిన వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.

'అప్పు ప్రతిపాదన విరమించుకోవాలి'

దాబాగార్డెన్స్ : మధురవాడలో వ్యర్థ నీటి కాలువల నెట్ వర్క్ నిర్మాణాలకు సంబంధించి రూ.500 కోట్లు అప్పు తీసుకోవాలని ప్రతిపాదించటం సరికాదని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు శనివారం వినతిపత్రంలో మేయర్‌కు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల జీవీఎంసీ పూర్తిగా దివాళా తీస్తుందని, ప్రజలపై అనేక భారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆస్తి పన్ను పెరిగిందని, చెత్తపై యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారని, త్వరలో నీటి చార్జీలు పెంచబోతున్నారని, ఇది తగదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కృష్ణా కళాశాల అధ్యాపకుడు 'పోలా'కు ప్రధాని ప్రశంస



అధ్యాపకుడు పోలా ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు ప్రధానమంతి నరేంద్ర మోదీ ప్రశంసలు పొందారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు తగు సూచనలు చేసినందుకు పోలాను ప్రధాని అభినందిస్తూ కళాశాలకు ప్రశంసా పత్రాన్ని పంపించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. 'మీ భాగస్వామ్యం మీ పిల్లల భవిష్యత్తు పట్ల మాత్రమే కాకుండా మన యువ తరం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల మీ చిత్త శుద్ధి ప్రతిబింబిస్తుంది' అని ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును కళాశాల అధ్యాపకులు అభినందించారు.